సాక్షి అనంతపురం

గురువారం । 12 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టీబీ డ్యాంలో తగ్గిన నీరు

తుంగభద్ర జలాశయంలో నీరు తగ్గింది. బుధవారం నీటి నిల్వ 49.398 టీఎంసీలకు పడిపోయింది.

గరిష్ఠం/కనిష్ఠం

37.6°/ 22.9°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై.. అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పరిష్కరించండి



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

గుత్తి: పెండింగ్ కేసులకు సత్వరమే పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. బుధవారం ఆయన గుత్తి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులన్నింటినీ ఎస్పీ పరిశీలించారు. అనంతరం పిటీషనర్ల తో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, సీఐ వెంకటరామిరెడ్డి, ఏఎస్ఐలు నాగమాణిక్యం, ఆజాద్, రామచంద్రా రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, జాఫర్ , ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామూహిక గృహ ప్రవేశాలు



రాయదుర్గంలోని గౌడ లేఅవుట్‌లో జగనన్న ఇళ్లు


అనంతపురం టౌన్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తోంది. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 76,169 ఇళ్లు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 20,345 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన వాటికి సంబంధించి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నారు. గురువారం ఉదయం జిల్లా వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాల పండుగ నిర్వహిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని తాడిపత్రి మండలం సజ్జలదిన్నె జగనన్న కాలనీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు హాజరు అవుతున్నట్లు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో అక్కడి అధికారుల తోపాటు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు



అనంతపురం ఎడ్యుకేషన్: 'పది' ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లింపు గడువును అపరాధ రుసుం లేకుండా ఈ నెల 20 వరకు పొడిగించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడుకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మైగ్రేషన్ పత్రం కోసం రూ.80 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. www. bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

14,500 క్వింటాళ్ల విత్తనం పంపిణీ



విత్తన పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో పంట సాగుకు వీలుగా నల్లరేగడి భూములు కలిగిన 21 మండలాల పరిధిలో 40 శాతం రాయితీతో విత్తన పప్పుశనగ పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. బుధవారం నాటికి 14,500 క్వింటాళ్ల విత్తన పంపిణీ పూర్తి చేశారు. జిల్లాకు 27,266 క్వింటాళ్ల విత్తనం కేటాయించారు. ఆర్‌బీకే వేదికగా 16,031మంది రైతులు 22,295 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా 19 వేల క్వింటాళ్లు ఆర్‌బీకేల్లో నిల్వ చేశారు. ఇందులో 14,500 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

రూ.5 కోట్లు మెక్కేశారు!


- వచ్చిన ప్రతిరూపాయి జేబులోకి వేసుకున్నారు
- నకిలీ రశీదులతో ప్రజలను బురిడీ కొట్టించారు
- గన్నేవారిపల్లి పంచాయతీలో తవ్వేకొద్దీ అక్రమాలు
- మాజీ సర్పంచ్.. ప్రస్తుత సర్పంచ్‌లే ప్రధాన సూత్రధారులు
- అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అధికారుల కసరత్తు



గన్నేవారిపల్లి సచివాలయం వద్ద పంచాయతీ నిబంధనలకు సంబంధించి ఏర్పాటు చేసిన బోర్డు



గన్నేవారిపల్లి గ్రామ సచివాలయం



ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి రూ.1.07 లక్షలకు ఇచ్చిన నకిలీ రశీదు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పంచాయతీరాజ్ విభాగంలో జిల్లాలోనే అతిపెద్ద కుంభకోణం తాడిపత్రి మండలం గన్నేవారిపల్లి పంచాయతీలో వెలుగుచూసింది. పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ము భారీ స్థాయిలో దుర్వినియోగమైంది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్టుగా సాగింది ఈ వ్యవహారం. నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి సిక్కిం, నాగాలాండ్ నుంచి బస్సులు తెచ్చి విక్రయించిన కేసులో టీడీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఆయన అనుచరులుగా తాము తక్కువ తినలేదని నిరూపించారు గన్నేవారిపల్లి సర్పంచ్‌లు. గడిచిన ఎనిమిదేళ్లలో రూ.5కోట్లకు పైగా పంచాయతీ నిధులను మెక్కేసినట్లు ప్రాథమిక విచారణలో బట్టబయలైంది.

అవినీతికి పరాకాష్ట..

గన్నేవారిపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగం అవినీతికి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. 2014 నుంచి ఇప్పటి వరకూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారే సర్పంచుగా ఉన్నారు. 2019 వరకు ఒకరు, ప్రస్తుతం ఇంకొకరు సర్పంచ్‌గా ఉన్నారు. వీళ్లిద్దరూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి ప్రధాన అనుచరులు. జేసీ ప్రభాకర్‌రెడ్డి అండదండలు ఉండటంతో పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయినీ తినేశారు. ప్రజలు కట్టే పన్నులన్నింటికీ నకిలీ రశీదులు అందజేసి, ఆ నగదు జమ చేయకుండా నేరుగా తమ జేబుల్లో వేసుకున్నారు. గడిచిన ఎనిమిదేళ్లలో ఒక్క రూపాయి కూడా పన్నుల రూపంలో ఖజానాకు చేరలేదు. ఇటీవల కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా దాదాపు 40 మంది సిబ్బందితో విచారణ చేయిస్తే అసలు నిజాలు బయటికొచ్చాయి. ఇప్పటివరకూ రూ.5 కోట్లకు పైగా సొమ్మును టీడీపీ నాయకులు (సర్పంచ్‌లుగా పనిచేసిన వారు) తినేసినట్టు తేలింది.

ఎక్కడెక్కడ దోచుకు తిన్నారంటే...

- భవన నిర్మాణానికి వచ్చిన అనుమతులన్నిటికీ డబ్బు వసూలు చేసి దొంగ రశీదులు ఇచ్చారు.
- చిన్న చిన్న షాపుల నుంచి మాల్స్ వరకూ ట్రేడ్ లైసెన్సుల మంజూరుకు డబ్బు భారీగా వసూలు చేశారు. ఇందులో ఒక్కపైసా కూడా పంచాయతీ ఖాతాకు జమ కాలేదు.
- వేలాది కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. వీటికి ఒక్కో దానికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేశారు. అన్నీ దొంగ రశీదులు ఇచ్చినవే.
- ఇంటిపన్నులు భారీగా వసూలు చేశారు. కానీ ఒక్క పైసా కూడా పంచాయతీ ఖాతాలో జమ చేయలేదు. మొత్తం పక్కదారి పట్టాయి.
- సేవా పన్ను (సర్వీస్ టాక్స్) కింద వసూలు చేసిన మొత్తం సొమ్మును జేబులో వేసుకున్నారు.
- ల్యాండ్ రెవెన్యూ పన్నుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేసి తినేశారు.
- నీటిపన్ను ప్రతి ఇంటికీ వసూలు చేశారు. అలా 8 ఏళ్ల పాటు వసూలు చేసిన సొమ్మును పైసా కూడా ప్రభుత్వానికి జమచేయలేదు.

ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు ప్రతిపాదనలు

- కక్కలపల్లి కాలనీలో కేరళ బృందం పర్యటన



సచివాయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కేరళ బృందం ప్రతినిధి సోనియా

రాప్తాడురూరల్: గ్రామ పంచాయతీ ప్రజలకు అందించే పౌరసేవలకు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్ (ఐఎస్ఓ) సర్టిఫికెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 52 పంచాయతీలను ఎంపిక చేసింది. ఇందులో అనంతపురం జిల్లా నుంచి అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీని నామినేట్ చేశారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందే పౌరసేవలపై క్వాలిటీ మేనేజ్‌మెంట్ గుర్తింపు కోసం నీటి సరఫరా, విద్యుత్ సేవలు, ఇంటి, నీటి పన్నులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, వీధిదీపాల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రత, ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణ, వైద్యసేవలు తదితర అంశాల ఆధారంగా ఐఎస్ఓ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

కేరళ బృందం పర్యటన

కక్కలపల్లికాలనీ పంచాయతీని పరిశీలించేందుకు కేరళ రాష్ట్రం నుంచి ప్రతినిధుల బృందం బుధవారం వచ్చింది. ఈబృందానికి సోనియా నాయకత్వం వహించారు. గ్రామ పంచాయతీని సందర్శించి సచివాలయ భవన నిర్మాణం, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందేందుకు ప్రతిపాదనలు పంపుతామని సోనియా తెలిపారు. బృందం వెంట అనంతపురం డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి, ఎంపీడీఓ పుల్లయ్య, విస్తరణ అధికారి మాధవి, కక్కలపల్లి కాలనీ పంచాయతీ సర్పంచ్ తేజస్విని, కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

బోధనాస్పత్రికి మహర్దశ

- రూ.6.9 కోట్ల నిధుల మంజూరు
- సర్వజనాస్పత్రి, వైద్య కళాశాలలో 13 పనులు





అనంతపురం మెడికల్: అనంతపురం బోధనాస్పత్రి (సర్వజనాస్పత్రి – ప్రభుత్వ వైద్య కళాశాల)కి మహర్దశ పట్టనుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. బోధానస్పత్రికి ప్రభుత్వం రూ.6.9 కోట్ల నిధులు కేటాయించింది. అందులో వైద్య కళాశాలలో 8 అభివృద్ధి పనులకు రూ.3.4 కోట్లు, సర్వజనాస్పత్రిలో 5 పనులకు రూ.3.5 కోట్లు కేటాయించింది. ఆస్పత్రిలోని ఓల్డ్ బ్లాక్‌లో ఉన్న గైనకాలజీ, రేడియాలజీ విభాగాల్లో మరమ్మతు పనులకు రూ.కోటి, అదే బ్లాక్‌లో రెండో ఫ్లోర్‌లో సర్జికల్ విభాగానికి రూ.65 లక్షలు, ఆర్థో బ్లాక్‌లోని ఆర్థో, జనరల్ మెడిసిన్ విభాగానికి రూ.1.05 కోట్లు, క్యాజువాలిటీ, ఏఎంసీకి రూ.57 లక్షలు, మార్చురీకి రూ.23 లక్షలు కేటాయించారు. వైద్య కళాశాలలో అనాటమీ, ఫోరెన్సిక్, ప్రిన్సిపాల్ కార్యాలయానికి రూ.40 లక్షలు, పెథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ విభాగానికి రూ.24 లక్షలు, వైద్య కళాశాల టెర్రాస్ ఫ్లోర్, బిల్డింగ్ బయట భాగానికి రూ.35 లక్షలు, ఆడిటోరియానికి రూ.29 లక్షలు, యూజీ బాలికల హాస్టల్‌కు రూ.42 లక్షలు, యూజీ బాయ్స్ హాస్టల్‌కు రూ.46 లక్షలు, మెడికల్ కాలేజ్ స్టాఫ్ క్వార్టర్స్‌కు రూ.84 లక్షలు కేటాయించారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే రోగులకు నాణ్యమైన సేవలందే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్, ఏఎంసీ, ఐసీసీయూ విభాగాల్లో ఏసీల మరమ్మతులు జరగనున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణతో నిఘా మరింత పటిష్టం కానుంది.

పనుల పూర్తికి చర్యలు

బోధనాస్పత్రిలో 13 అభివృద్ధి పనులకు సంబంధించి 8 పనులకు టెండర్ల నిర్వహణ పూర్తయ్యింది. త్వరలో మిగతా వాటికి టెండర్లు పూర్తవుతాయి. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

నకిలీ కమిషనర్ అరెస్ట్

- జల్సాలకు అలవాటు పడి సైబర్ నేరాలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరసింగప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప, సీఐ గణేష్

గుంతకల్లు: ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ పేరిట వసూళ్లు చేస్తున్న నకిలీ మున్సిపల్ కమిషనర్‌ను గుంతకల్లు పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల తాను గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ అంటూ ఓ సైబర్ నేరగాడు పట్టణంలోని కొంతమంది షాపు ఓనర్లు భయపెట్టి ఫోన్‌పే ద్వారా రూ.1000 చొప్పున వసూళ్లు చేస్తున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటన విడుదల చేస్తూ అపరిచిత వ్యక్తుల ఫోన్లు వస్తే స్పందించకుండా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, టూటౌన్ సీఐ గణేష్ నకిలీ మున్సిపల్ కమిషనర్ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఈ సైబర్ నేరగాడు స్థానిక టీవీ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణంలోని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. సైబర్ నేరగాడు వైఎస్సార్ జిల్లా వి.కోడూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావుగా గుర్తించామన్నారు. కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

జల్సాల కోసమే సైబర్ నేరాలు..

వైఎస్సార్ జిల్లా వి.కోడూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావు ప్రైవేటు ఉద్యోగి. ఇతడు జల్సాలకు అలవాటు పడ్డాడు. భార్యకు విడాకులిచ్చి.. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. జల్సాలకు అవసరమైన డబ్బును సమకూర్చుకునేందుకు ప్రభుత్వ అధికారుల హోదాను వాడుకుంటూ సైబర్ నేరాలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో తన పేరు జశ్వంత్‌రెడ్డి అలియాస్ సురేంద్రరెడ్డి పేర్లతో చలామణి అవుతున్నాడు. ఇతనిపై వైఎస్సార్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఐదు కేసులు నమోదయ్యాయి.

విజిల్ తప్పనిసరి..!



విజిల్ తగిలించుకుంటున్న పోలీసులు

అనంతపురం క్రైం: పోలీసు శాఖలోని సీఐ స్థాయి అధికారి నుంచి సాధారణ హోంగార్డు దాకా ప్రతి ఒక్కరూ విజిల్ వినియోగించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, నైట్ బీట్‌లలో తప్పనిసరిగా విజిల్ వినియోగించాలన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది రోడ్లపై ఉండాలని ఎస్పీ ఆదేశించారు. బుధవారం అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు సీఐ రెడ్డెప్ప విజిల్స్ తెప్పించి అందజేశారు. ప్రతి ఒక్కరూ యూనిఫాంకు విజిల్‌ను తగిలించుకోవాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



డీఐజీ అమ్మిరెడ్డి

పామిడి: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు సిబ్బంది పనిచేయాలని డీఐజీ అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పామిడి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పలు కేసులను సమీక్షించారు. పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డీఐజీ సూచించారు. న్యాయం కోసం స్టేషన్‌ను ఆశ్రయించే వారి సమస్యలపై సకాలంలో స్పందించాలన్నారు. మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- 24 చోట్ల 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- 6,768 మందికి సేవలందించిన వైద్యులు
- 402 మంది ఆస్పత్రులకు రెఫర్



తూర్పు కోడిపల్లిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమి



కణేకల్లు 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. బుధవారం జిల్లాలోని 24 ప్రాంతాల్లో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించారు. 6,768 మంది ఓపీ సేవలు పొందారు. వీరిలో 1,597 మంది వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్నారు. 402 మందిని మెరుగైన వైద్యం/ ఆపరేషన్ల కోసం జిల్లా ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

నేడు 28 ప్రాంతాల్లో క్యాంపులు

జిల్లాలో గురువారం 28 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి తెలిపారు. ఆకుతోటపల్లి, బి. యాలేరు, ఉద్దేహాళ్, ఎరడికెర, మద్దేనహళ్లి, మర్తాడు, ఉబిచెర్ల, భూపసముద్రం, నెలగొండ, తిమ్మసముద్రం, రచ్చుమర్రి, మరుట్ల, రాంపురం, మలయనూరు, చామలూరు, సారకాయలపేట, పెద్దవడుగూరు, మద్దిపల్లి, పాలచెర్ల, జూలాకాలువ, వెంకటరెడ్డిపల్లి, చిన్నముష్టూరు, కరకముక్కల, నిట్టూరు, దంతలపల్లి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, అనంతపురం నేతాజీ స్కూల్, గుంతకల్లులోని భాగ్యనగర్, తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఉంటాయన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

కళ్యాణదుర్గం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేయాలన్నారు. బుధవారం కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడిపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్య పరీక్ష గదులు, మందుల కౌంటర్లను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. ఏ మందులు ఎక్కువగా అవసరమవుతున్నాయి, ఎన్ని కేసులను శస్త్రచికిత్సలకు రెఫర్ చేశారు తదితర వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భ్రమరాంబదేవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఫణికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ సుజాత, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మాన్, డాక్టర్లు విజయేంద్ర, ప్రత్యూష, శివకుమార్, రూపా, ఫార్మసిస్ట్ మాధవ, ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, సచివాలయ కన్వీనర్లు చిత్తయ్య, వన్నప్ప, కేశవగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమ్మాయిలకు సర్కారు కొండంత అండ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, జడ్జి దీన తదితరులు

అనంతపురం సిటీ: రాష్ట్రంలో అమ్మాయిలు, మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కొండంత అండగా ఉంటోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కురుగుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం 'బాల్య వివాహ రహిత భారతదేశం' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గిరిజమ్మతో పాటు అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బాలికలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశ పెట్టి ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. అమ్మాయిలు ప్రేమ పేరుతో జీవితాలు పాడు చేసుకోకుండా క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎదుగుతున్న సమాజానికి బాల్య వివాహాలు ప్రతిబంధకంగా మారుతాయని సీనియర్ సివిల్ జడ్జి దీన పేర్కొన్నారు. వయసు రాకనే పిల్లలకు పెళ్లిళ్లు చేసి, బరువు దించుకోవాలన్న ఆలోచనలను తల్లిదండ్రులు మానుకోవాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి సూచించారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతున్నాయని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

క్లుప్తంగా

ఆర్బీకేలో డీఏఓ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈ-కేవైసీ ప్రక్రియపై స్థానిక ఉద్యోగులతో ఆరా తీశారు. ఇంకా ఎవరన్న రైతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లప్ప, ఎంఏఓ జగదీష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యల్లనూరు: మండల కేంద్రంలోని పుడమి, సుధాట్రేడర్స్ ఎరువుల దుకాణాల్లో బుధవారం ఉదయం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పుడమి అగ్రిమార్ట్‌లో అనధికారిక ఎరువులను గుర్తించి తాత్కాలికంగా అమ్మకాలు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.2,27,700 విలువ చేసే మొత్తం 11.2 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఏఓ వాసుప్రకాష్, ఎస్ఐ జయపాల్‌రెడ్డితో పాటు స్థానిక ఏఓ రామకృష్ణుడు పాల్గొన్నారు.

అమ్మ చెప్పింది.. గ్రూప్-1 సాధించా!

- గుమ్మఘట్ట మండలం ఆర్ కొత్తపల్లికి చెందిన రమేష్ స్ఫూర్తి గాథ
- తల్లి కష్టం వృథా పోనివ్వని కుమారుడు



తల్లి మారెక్కతో రమేష్ (ఫైల్)



అనంతపురం ఎన్జీఓ కార్యాలయంలో రమేష్‌ను సన్మానిస్తున్న స్నేహితులు (ఫైల్)

రాయదుర్గం: అమ్మచెప్పిన మాటలు ఆయనలో కసి పెంచాయి. ప్రతిష్టాత్మక గ్రూప్-1 పరీక్షలో విజయ బావుటా ఎగరేసేలా చేశాయి. గుమ్మఘట్ట మండలం ఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన తిప్పయ్యగారి రమేష్ స్ఫూర్తిదాయక గాథ ఇది. ''లక్ష్య సాధనలో వైఫల్యాలు ఎదువడం మామూలే. ఎలా ఓడిపోయామో కారణాలు అన్వేషిస్తే అదే లక్ష్యం చేరుస్తుంది'' అని చెబుతున్న రమేష్ విజయగాథ ఆయన మాటల్లోనే...

మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనంలోనే నాన్న హరిజన తిప్పయ్య మృతి చెందాడు. దీంతో అమ్మ మారెక్కపై కుటుంబ భారం పడింది. ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల్లో వ్యవసాయం చేస్తూ అందరినీ పోషిస్తూ వచ్చేది. 'ఒరేయ్ నాన్నా.. మన ఊరి రామారావు (ఆర్డీఓ) సార్‌ని చూశావా. బాగా చదువుకున్నాడు కాబట్టే పెద్ద ఉద్యోగం సాధించాడు. ఊరికి కార్లోనే వచ్చి పోతున్నాడు. నీవు కూడా అలా ఎదగాలి, అలా చదవాలి' అంటూ తరచూ ఆమె చెప్పేది. ఆ మాటలే నాలో కసి పెంచాయి.

చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే..

1 నుంచి 5వ తరగతి వరకూ వరకూ స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివా. కణేకల్లు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీటు లభించడంతో 6 నుంచి 10 వరకూ అక్కడ పూర్తి చేశా. పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించా. ఆర్థిక ఇబ్బందులు, అమ్మకు వ్యవసాయ పనుల్లో తోడుగా నిలిచేందుకు చదువు మానాలని భావించా. అయితే, ఆ సమయంలో గ్రామానికి చెందిన పంపాపతి, ఆర్డీఓ రామారావు సార్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. వారిచ్చిన స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో జరిగిన గురుకుల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించా. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల జూనియర్ కళాశాలలో సీటు దక్కడంతో అక్కడే ఇంటర్ పూర్తిచేశా. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో 2002-05లో బీఎస్సీ- ఎలక్ట్రానిక్స్ చదివా. 2005-08 మధ్య కాలంలో ఎంసీఏ చేశా. లాస్ట్ సెమిస్టర్ కొనసాగుతుండగా గ్రూప్-1 నోటిఫికేషన్ వచ్చింది. అయినా, దరఖాస్తు చేసి ప్రిలిమ్స్, మెయిన్స్‌లో సత్తా చాటా. 2013లో ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యా. సుప్రీం కోర్టు ఆ నోటిఫికేషన్ రద్దు చేయడంతో అప్పట్లో ఉద్యోగం వచ్చినట్లే వచ్చి చేజారింది. దీంతో చాలా బాధపడ్డా.

గ్రూప్-2కు ఎంపికయ్యా..

గ్రూప్-1 ఉద్యోగం రాలేదని నిరాశం కలిగినా, 2008లోనే వచ్చిన గ్రూప్-2 రాశా. విజయవాడ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగం దక్కడంతో కొంత సంతోషమేసింది. అయినా, అమ్మ కోరుకున్నట్టు గ్రూప్-1 ఉద్యోగం సాధించలేక పోయాననే బాధ ఏదో ఓ మూలన మిగిలిపోయింది. ఈ కారణంగా ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాద్‌లోని 'టైమ్' కోచింగ్ సెంటర్‌లో ఫ్యాకల్టీగా చేరా. చదువు చెప్పడం ఎంతో ప్రయోజనం చేకూర్చింది.

యువత కొత్తగా ఆలోచించాలి

విద్యతోనే పేదరికం దూరం కానుందనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలి. నా ఈ హోదా విద్యతోనే సాధ్యమైందని గర్వంగా చెబుతా. యువత కొత్తగా ఆలోచించాలి. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరిన వారి నుంచి స్ఫూర్తి పొందాలి. ఈ విషయాలే నా విజయంలో కీలక భూమిక పోషించాయి. నేడు టెక్నాలజీ వినియోగం బాగా పెరిగింది. సెల్‌ఫోన్‌ను వృథా వాటికి కాకుండా కావాల్సిన సమాచార సేకరణకే ఎంపిక చేసుకోవాలి. పత్రికలను రోజూ చదివితే లక్ష్య సాధన సులువవుతుంది.

అమ్మ కళ్లలో ఆనందం

గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపిక కావడంతో నా కంటే అమ్మే ఎక్కువ సంతోష పడింది. ఆమె కళ్లలో ఆనందం చూడాలనే తపన, శ్రమ నెరవేర్చేందుకు సహకరించిన వారందరికీ రుణపడి ఉంటా. ముఖ్యంగా మా గ్రామంలో పంపాపతి, ప్రస్తుతం విజయవాడ దుర్గగుడి ఈఓగా విధులు నిర్వహిస్తున్న రామారావు సార్ సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయి. నా చిన్నప్పుడు మా అమ్మ పడ్డ కష్టం, పేదరికం ఇప్పటికీ కళ్లముందే మెదులుతోంది. పేదరికం రూపుమాపేందుకు నా వంతు కృషి చేస్తా.

లక్ష్యంతో చదివా.. ఉద్యోగం సాధించా

2022లో విడుదలైన గ్రూప్-1 నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేశారు. పరీక్షల్లో పాల్గొన్నా. ఉద్యోగం వస్తుంది... అమ్మకల నెరవేరుతుందని గట్టిగా నమ్మి దేవుడిమీద భారం వేశా. ఈ ఏడాది ఆగస్టు 17న విడుదలైన ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపికయ్యా. చాలా సంతోషంగా ఉంది. కర్నూలు జిల్లా ఆదోని జీజీహెచ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇచ్చింది.

వ్యక్తి దుర్మరణం

- వెనుక నుంచి బలంగా హారన్ మోగించిన వాహన డ్రైవర్
- ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొన్న వైనం
- మృతుడు విద్యుత్ శాఖ ఉద్యోగి

పెద్దవడుగూరు: రోడ్డు పక్కన నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వసంతకుమార్ అలియాస్ ప్రేమ్ (49) గార్లదిన్నె మండలం కల్లూరులో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజూ విధులకు గుత్తి ఆర్ఎస్ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన ఆయన పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహన డ్రైవర్ వెనుక నుంచి గట్టిగా హారన్ మోగించడంతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. అదే సమయంలో అప్రయత్నంగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి అప్పటికే రోడ్డుకు ఎడమ వైపు నిలబడిన కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో వసంతకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహం(ఇన్‌సెట్‌లో) వసంత్‌కుమార్ (ఫైల్)

మరదలిపై కత్తితో దాడి

- అన్నం తింటుండగా బావ అఘాయిత్యం



చికిత్స పొందుతున్న మారుతమ్మ

కళ్యాణదుర్గం: ఆస్తి విషయంగా కక్ష పెంచుకున్న బావ... ఏకంగా మరదలిపై హత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లికి చెందిన హరిజన మారుతమ్మ కళ్యాణదుర్గం పట్టణ పరిధిలోని శంకరప్ప తోట కాలనీలో నివాసముంటూ స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆరేళ్ల క్రితం బ్రహ్మసముద్రం మండలం సంతేకొండాపురం నివాసి మేడా రాధాకృష్ణతో ప్రేమ వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో రాధాకృష్ణ మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే జీవిస్తోంది. ఈ క్రమంలో సంతే కొండాపురంలో తన భర్తకు చెందిన ఆస్తిని కోర్టుకెళ్లి దక్కించుకుంది. ఇందులో ఇటీవల రెండు సెంట్ల స్థలాన్ని విక్రయించేందుకు ఆమె సిద్ధం కావడంతో రాధాకృష్ణ సోదరుడు మేడా వెంకటేశులు అభ్యంతరం లేవనెత్తాడు. అయినా ఆమె వినకపోవడంతో కక్ష పెంచుకున్న ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేస్తున్న మారుతమ్మపై మచ్చుకత్తితో దాడి చేశాడు. ఆ సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో వెంకటేశులు అక్కడి నుంచి పారిపోయాడు. మారుతమ్మ తలకు, భుజానికి బలమైన గాయలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డ్రిప్ పైపుల కాల్చివేత

రాయదుర్గం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు మంట రాజేయడంతో డ్రిప్ పైపులు కాలి బూడిదయ్యాయి. రాయదుర్గం మండలం కాశీపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చిన్నస్వామి కుమారుడు గంగాధర తనకున్న ఐదు ఎకరాల పొలంలో మొక్క జొన్న సాగు చేశాడు. మంగళవారం పంట కోత పూర్తయింది. పంట సాగుకు వినియోగించిన డ్రిప్ పైపులను తొలగించేందుకు బుధవారం పొలానికి చేరుకున్నాడు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు రాజేసిన మంట కారణంగా 50 కట్టల డ్రిప్ పైపులు పూర్తిగా కాలి పోయాయి. దీంతో రూ.1లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపండి

- కలెక్టర్ గౌతమి




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి

కళ్యాణదుర్గం: 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమానికి అందిన ఫిర్యాదులకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో బుధవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ గౌతమి హాజరై నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు గడువు లోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఏ అర్జీనీ పెండింగ్‌లో ఉంచరాదని ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలకు స్థానికంగానే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్జీల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. అంతకు ముందు కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డీఎల్‌డీఓ శంకర్, వివిధ శాఖల అధికారులు అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రావు, డీఈఓ నాగరాజు, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఫిషరీస్ డీడీ శాంతి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, డీఎస్ఓ శోభారాణి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, డీటీడబ్ల్యూఓ అన్నాదొర, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ రూప్లా నాయక్, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, తహసీల్దార్ ఫణికుమార్‌తో పాటు ఇతర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాస్మిక్ కిరణాలను గుర్తించే పరికరం ఆవిష్కరణ

- జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శైలకుమారి, రాఘవేంద్ర వినూత్న పరిశోధన



ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకుంటున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: అత్యంత శక్తివంతమైన కాస్మిక్ కిరణాలను గుర్తించే పరికరాన్ని జేఎన్‌టీయూ (ఏ) మేథమేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శైలకుమారి, ఆర్.రాఘవేంద్ర ఆవిష్కరించారు. 'ఏ స్టడీ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఈక్వేష్ ఆఫ్ గాలాక్టిక్ కాస్మోటిక్ రేస్ ఇన్ ద అట్మాస్ఫియర్ - కాస్మిక్ ఎనర్జీ డిక్టేటర్' అనే ప్రాజెక్ట్‌పై వారు పరిశోధన చేసి, ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జేఎన్‌టీయూ పాలకభవనంలో బుధవారం ఆ వర్సిటీ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన, రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫిజిక్స్ విభాగాధిపతి ఆర్.పద్మ సువర్ణ సమక్షంలో వెల్లడించారు. కాస్మిక్ కిరణాలు ముఖ్యంగా ప్రోటాన్లు, భారీ అయాన్లు వంటి అధిక శక్తి కణాలు. ఇవి క్యాన్సర్ చికిత్స కోసం రేడియేషన్ థెరపీలో ఉపయోగించే కణాలకు సమానమైన లక్షణాలను కలిగి ఉంటాయి. ప్రోటాన్ థెరపీ, కార్బన్ అయాన్ థెరపీతో సహా పార్టికల్ థెరపీ క్యాన్సర్ చికిత్సలో భాగం. ఈ నేపథ్యంలో కాస్మిక్ కిరణాలకు అత్యంత ప్రాధాన్యత చేకూరింది. అంతేకాక మానవ శరీరంలో రక్తశుద్ధి చేసేందుకూ కాస్మిక్ కిరణాలు దోహదపడతాయి. ఈ పరికరాన్ని ఉపయోగించి పిరమిడ్‌లో అత్యధికంగా కాస్మిక్ కిరణాలు ఉన్నట్లు నిర్ధారణ చేశారు. మన చుట్టూ ఉండే పరిసరాల్లో ఎంత మేర కాస్మిక్ కిరణాలు ఉన్నాయి? అనే అంశాన్ని సైతం ఈ పరికరం ద్వారా కనుగొనవచ్చు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఓ పోర్టబుల్ మ్యూయాన్ డిటెక్టర్‌కు రూపకల్పన చేశారు. కాస్మిక్ కిరణాల గుర్తింపు, కచ్చితత్వాన్ని కొలిచేందుకు వీలుగా ఆర్డినో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను ఉపయోగించారు. ఉష్ణోగ్రత, తేమ, అక్షాంశం, రేఖాంశం, వాతావరణ పీడనంపై డేటాను సేకరించడానికి సెన్సార్లను ఏర్పాటు చేశారు. కాగా, ఈ పరిశోధనకు రూ.90 వేలను జేఎన్‌టీయూ (ఏ) వెచ్చించింది. రెండేళ్ల కాల పరిమితి గల ఈ పరిశోధన 15 నెలల్లోనే పూర్తి చేయడంపై శైలకుమారి, రాఘవేంద్రను వీసీ జింకా రంగజనార్ధన అభినందించారు. ప్రాజెక్ట్‌ను కొనసాగిస్తూ ఆవిష్కరణను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.

ఫెన్సింగ్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం: తూర్పుగోదావరి జిల్లా వేదికగా ఈ నెల 14 నుంచి జరిగే 10వ రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిథ్యం వహించే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ బుధవారం ముగిసింది. మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరు కాగా, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన 42 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్ 23 ఫాయిల్ విభాగంలో ఎం.రాహుల్, ఎ.మనోజ్, డి.విజయ్‌కుమార్, ప్రణీత్, పి.సమీరారెడ్డి, యశస్విణి, ఎస్.నాగవర్షిత, జి.చందన ఎంపిక కాగా, ఇప్పి విభాగంలో ఎస్. ముషైన్, ఎ.ఆంజనేయ సూర్య, పి.హరివేంద్ర, ఎస్.నూర్ మహమ్మద్, జి.సిరి, కె.వర్షిత, ఎన్.అలియ, టి.శరణి... సాబర్ విభాగంలో డి.సుప్రూత్ సింహ, ఎస్.ఇనాయతుల్లా, మోహిత్, పురంజమ్, ఎం.నిఖిత, పి.సిరి, ఎం.గాయత్రి చోటు దక్కించుకున్నారు. అలాగే సీనియర్స్ ఫాయిల్ విభాగంలో రోమన్, త్రివేణి , జెస్పర్,నిఖిత, ప్రబంధ, ఇప్పి విభాగంలో రాహుల్, సమీర్, కృష్ణ, బి.బాసతి, సాబర్ విభాగంలో రామకృష్ణ, రవికుమార్, కుషాల్, సిరి, పి.షబాఖానమ్, సాదియా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ ఎ.మురళీకృష్ణ, ఖేలో ఇండియా కోచ్ కె.లక్ష్మీదేవి, కె.కృష్ణ, డి.సమీర్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో చోరీ

గార్లదిన్నె: స్థానిక డ్యాం రోడ్డు రైల్వే గేట్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన సంగిరెడ్డి మంగళవారం వ్యక్తిగత పనిపై మరో గ్రామానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి కుమారుడు చెన్నకేశవరెడ్డి ఇంటికి తాళం వేసి మిద్దెపైకి చేరుకుని నిద్రపోయాడు. విషయాన్ని గమనించిన దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని 4 తులాల బంగారు నగలు, రూ.30 వేలు అపహరించుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున మిద్దెపై నుంచి కిందకు దిగివచ్చిన చెన్నకేశవరెడ్డి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విత్తన పప్పుశనగ సరఫరాలో నిబంధనలు పాటించండి

బెళుగుప్ప: రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న విత్తన పప్పుశనగ సరఫరాలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బెళుగుప్పలోని వినాయక సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. విత్తన మొలక శాతాన్ని పరిశీలించి, పలు రికార్డులు తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసిన 1,400 క్వింటాళ్ల పప్పుశనగకు సంబంధించిన నివేదికలను పరిశీలించి 2,500 క్వింటాళ్ల అనుమతులను పూర్తి చేయాలని సీడ్ యూనిట్ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఏఓ పృథ్వీసాగర్, ఏఓ వాసుకీరాణి, టెక్నికల్ వ్యవసాయాధికారి రాకేష్ నాయక్, సీడ్ యూనిట్ నిర్వాహకుడు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీనీలో మంగునల్లి నివారణకు చర్యలు చేపట్టండి



మంగునల్లి ఆశించడంతో దెబ్బతిన్న చీనీకాయలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ తోటలను మంగునల్లి ఆశించి నష్టం కలగజేస్తోందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. మంగునల్లి ఆశించిన చీనీకాయలకు మార్కెట్‌లో ధర తగ్గుతుందన్నారు. దీని వల్ల రైతులు నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. మంగునల్లి తొలిదశలో పాత ఆకులను ఆశించి, తర్వాత పండ్ల మీద ప్రభావం చూపుతుందన్నారు. పండ్ల బయట ఉపరితలాన్ని 0.5 అంగులం, అంతకన్నా ఎక్కువ పరిమాణంలో తినడంతో పాటు పండ్ల పైభాగంలో లాలాజలాన్ని వదలడం వల్ల పక్వానికి వచ్చిన పండ్లు ముదురు వక్క రంగులోకి, ఆకుపచ్చ పండ్లు నలుపు రంగులోకి మారుతాయన్నారు. ఈ తెగులు ఎక్కువగా వసంతకాలం నుంచి వేసవి వరకూ ఉంటుందన్నారు. తేమతో కూడిన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. తెల్లని గోలీ ఆకార గుడ్లను ఆకులు లేదా పండ్ల ఉపరితలంపై పెడతాయని, ఇవి రెండు దశల అపరిపక్వ కీటకాలుగా మారి తర్వాత వయోజన కీటకాలుగా ఎదుగుతాయన్నారు. గాలి ద్వారా చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాపించి నష్టం కలిగిస్తాయని వివరించారు. లీటర్ నీటికి 2 మి.లీ ప్రోపర్గైట్ లేదా 2 మి.లీ మెజిస్టర్ లేదా 2 మి.లీ ఒమైట్ లేదా 2 గ్రాములు వెజిటబుల్ సల్ఫర్ లేదా 2 గ్రాములు డైకోఫాల్, 1.5 మి.లీ వేపనూనె కలిపి పిచికారీ చేసుకుంటే మంగునల్లి ఉధృతిని సమర్థవంతంగా అరికట్టవచ్చునన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను చూపుతున్న పోలీసులు


తాడిపత్రి: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను తాడిపత్రి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ నాగస్వామి వెల్లడించారు. విధుల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు పుల్లంపల్లి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తాడిపత్రి వైపు నుంచి నార్పింపల్లి మీదుగా ధర్మవరం వైపు వెళుతున్న ఏపీ 16 టీఎఫ్ 1994 వాహనాన్ని ఆపి పరిశీలించగా 70 బస్తాల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలిస్తున్న తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికి చెందిన మేడిసారి సముద్రుడుని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలించి అధిక ధరకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ శారదకు అప్పగించి, నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బలో ఇరువర్గాల దాడికి సంబంధించి నమోదైన హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి వెల్లడించారు. నెల రోజుల క్రితం వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా మదిగుబ్బకు చెందిన ఉప్పర రాజు, బండ ధర్నేష్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనపై కక్ష పెంచుకున్న ఉప్పర రాజు... బండ ధర్నేష్‌ను, అతని బంధువులను హతమార్చాలని తన బంధువులతో కలసి ఈ నెల 10న గొడ్డలి, కొడవళ్లు, కట్టెలతో దాడికి తెగబడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బండ ధర్నేష్ , తలారి నారాయణమ్మ, తలారి పోతన్నను ఆస్పత్రిలో చేర్పించి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పక్కా ఆధారాలతో ఉప్పర రాజు, ఉప్పర కేశప్ప, ఉప్పర రమణమ్మ, ఉప్పర లక్ష్మి, ఉప్పర విశ్వనాథ్, ఉప్పర శ్రీరాములు, ఉప్పర చంద్రశేఖర్, ఉప్పర లక్ష్మన్న, ఉప్పర వెంకట్రాముడు, ఉప్పర లక్ష్మీనారాయణను బుధవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో చొరవ చూపిన సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ జనార్దన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆసియా క్రీడల విజేతలకు ప్రధాని మోదీ అభినందన

- క్రీడాకారుల్లో జిల్లాకు చెందిన అనూష



క్రికెటర్లను అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

అనంతపురం: ఆసియా క్రీడల్లో విజేతలుగా నిలిచిన భారత క్రికెటర్లకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. పురుషుల జట్టు, మహిళల జట్టు వేర్వేరుగా ఆసియా క్రీడల్లో గెలిచి బంగారు పతకాలను దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీని కలిసిన వారు క్రికెట్ బ్యాట్‌ను బహుకరించారు. ప్రతిభ చాటి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన క్రికెటర్లను ఈ సందర్భంగా ఆయన అభినందలతో ముంచెత్తారు. అభినందనలు అందుకున్న వారిలో జిల్లాకు చెందిన క్రికెటర్ బి.అనూష ఉన్నారు.

క్లుప్తంగా

జోరుగా ఈ-కేవైసీ



ఆత్మకూరులో ఈ-కేవైసీ చేయిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న చాలామంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదు.గత కొద్ది రోజులుగా వ్యవసాయ సిబ్బంది ఈక్రాప్ చేస్తూ ఈ-కేవైసీ చేసే పనిలో నిమగ్నమ య్యారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఓ యజ్ఞంలా ఈ-కేవైసీని పూర్తి చేశారు. ఏడీఏ రవి, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.రైతులందరినీ ఒకచోట సమావేశపరిచి ఈ-కేవైసీ చేయించారు. అంతేకాకుండా నడవలేని వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకే వ్యవసాయ అధికారులు ఈకేవైసీ చేయించారు.

మట్టి సేకరణ

రామగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కర్రెన్న, ఎంపీడీఓ ఫజిల్‌బాషా మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ నరేంద్ర రెడ్డి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దిశ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై, చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీకు తెలిసి బాల్య వివాహాలు చేస్తుంటే ఐసీడీఎస్ వారికైనా, పోలీసులకు అయినా సమాచారం ఇవ్వాలన్నారు. ఏ సమస వచ్చినా, ప్రమాదం జరిగినా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన్, హెచ్ఎం శ్రీనివాస ప్రసాద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని వడియంపేట కేశవరెడ్డి పాఠశాలలో బుధవారం జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వడియంపేట, మారుతీనగర్, సాయినగర్ బ్రాంచ్‌ల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బుక్కరాయసముద్రం సీఐ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. జోనల్ మీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో తిరుపతిలో జరిగే సెంట్రల్ మీట్‌లో పాల్గొంటారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో ఏజీఎం, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సుపై ఆకతాయిల దాడి

అనంతపురం క్రైం: స్థానిక సంగమేష్ నగర్‌లోని కూడలిలో ఆర్టీసీ బస్సుపై బుధవారం సాయంత్రం గుర్తు తెలియని ఆకతాయిలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసమైంది. స్థానికుల సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుల కోసం గాలించారు. తాగిన మైకంలో ముగ్గురు వ్యక్తులు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును యథాతథంగా కొనసాగించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద బుధవారం నిరసన తెలిపారు. కేవలం రూ.లక్ష ఫీజు పెండింగ్ ఉందని కోర్సు రద్దు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్ నాయక్, రాకేష్, చందు, ఇంద్ర, దివ్య, దాశరథి, రిషి, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు

- గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధి
- కౌన్సిల్ మీట్‌లో మేయర్ వసీం
- అన్ని విభాగాల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన పాలకవర్గం



సమావేశానికి హాజరైన ఎంపీ, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో వర్గపోరుతో నగరం అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో నగరంలో రూ.800 కోట్ల వరకూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంపీ తలారి రంగయ్య, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పాలకవర్గ సభ్యులు ప్రసంగించారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. నగరంలోని వివిధ డివిజన్లకు సంబంధించి ఒక్కో డివిజన్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం, ఆర్థిక సంఘం, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో పనులు సాగుతున్నాయన్నారు.

భూములు పరిరక్షించాలి

నగరపాలక సంస్థకు చెందిన రూ.వందల కోట్లు విలువ చేసే భూములను పరిరక్షించాలని కార్పొరేటర్లు బండి నాగమణి, అబూసలేహ డిమాండ్ చేశారు. గత కౌన్సిల్ సమావేశంలోనూ సెంట్రల్ పార్క్‌కు సంబంధించిన ఆరెకరాల స్థలం విషయంపై స్పష్టతనిచ్చి ప్రణాళిక ప్రకారం రోడ్లు, కంచె వేయాలని విజ్ఞప్తి చేసినా దాని ఊసేలేదని కార్పొరేటర్ బండి నాగమణి పేర్కొన్నారు. సెంట్రల్ పార్క్ స్థలం వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ భాగ్యలక్ష్మిని మేయర్ వసీం ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న స్థలంలో రోడ్లు, ప్రహరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈ నాగమోహన్‌ను ఆదేశించారు. కమలానగర్‌లోని నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో రోటరీ స్కూల్ నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారని కార్పొరేటర్ అబూసలేహ ఆరోపించారు. 6వ డివిజన్‌లోనూ 8 సెంట్ల స్థలం అన్యాక్రాంతమైందని కార్పొరేటర్ సుజాత ఫిర్యాదు చేశారు.

ఎస్ఈ నాగమోహన్‌ను నిలదీసిన కార్పొరేటర్లు

జనశక్తినగర్ వైపు నీరు మళ్లించేలా ఎందుకు చర్యలు తీసుకున్నారని ఎస్ఈ నాగమోహన్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి నిలదీశారు. వర్షం వస్తే ఆ కాలనీలు ముంపుకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. ముందుచూపు లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అడ్వైటైజ్‌మెంట్ బోర్డుల నిర్వహణను ఓపెన్ టెండర్ ద్వారా నిర్వహించాలని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా బోర్డులు ఏర్పాటు చేస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తారని ప్రశ్నించారు. కార్మికుల కేటాయింపు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, కుక్కలు, ఆవులు, పందుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు గురుశేఖర్‌బాబు, లీలావతి, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, ఇస్సాక్, అనిల్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ విభాగంలో సీటు మార్చిన ఆర్ఐను తిరిగి అదే స్థానంలో ఏ విధంగా పంపారని కార్పొరేటర్ బాలాంజనేయులు ప్రశ్నించారు.

కౌన్సిల్ ఆమోదంతోనే పనులు: కమిషనర్

కౌన్సిల్ ఆమోదంతోనే అభివృద్ధి పనులు చేపడుతామని కమిషనర్ భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా చెత్త నిర్వహణ చేపట్టారని కౌన్సిల్‌లో సభ్యులు ప్రస్తావించగా ఇందుకు కమిషనర్ స్పందించారు. కంపోస్టు యార్డులో నోవా ఏజెన్సీ నిర్వాహకులు ఫ్రెష్ వేస్టేజీను ఏ విధంగా చెత్త నిర్వహణ చేపట్టాలంటే డెమో చేశారన్నారు. బయోమైనింగ్ పద్ధతి ద్వారా చెత్త నిర్వహణకు సంబంధించి 2021లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్లను ఆహ్వానించి, చెత్త నిర్వహణ చేపట్టిందన్నారు. ప్రస్తుతం కంపోస్టు యార్డులో ఉన్న చెత్తను నిర్వహించడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్లను ఆహ్వానిస్తుందని తెలిపారు. నగరపాలక సంస్థ ఎంత మొత్తంలో చెత్త ఉందని ప్రతిపాదనలు మాత్రం పంపుతామన్నారు. మళ్లీ ఈ చెత్త నిర్వహణ చేపట్టాలన్నా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు టెండర్లను పిలుస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

మృతి చెందిన పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆమోదించారు. మృతి చెందిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి, నీటి సరఫరాకు సంబంధించి డీపీఆర్ ఏర్పాటుకు ఏజెన్సీ, పూడికతీత, తదితర అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, టీపీఓ శిరీష పాల్గొన్నారు.

ఆర్ఓబీకి పూలే పేరు పెట్టాలి: ఎంపీ రంగయ్య



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

'టవర్ క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జికు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టాలి. ఇది వరకే మేయర్, కమిషనర్లకు వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశా. పూలే లాంటి మహనీయుల ఆలోచనలతో చాలామంది ఉన్నతస్థాయికి చేరుకోగలిగారని ఎంపీ రంగయ్య తెలిపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను మనస్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధికారులు, కార్పొరేటర్ల మధ్య పరస్పర సహకారం ఉండాలని సూచించారు. అధికారులు తక్షణం స్పందిస్తున్నారన్న భావన కార్పొరేటర్లలో వచ్చేలా పనులు చేయాలని తెలిపారు. మరుసటి కౌన్సిల్ సమావేశం నాటికి కార్పొరేటర్ల సమస్యలను పరిష్కరించి, వాటికి సంబంధించి తీసుకున్న చర్యలను వారికి చదివి విన్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కంపోస్టు యార్డుకు సంబంధించి మేయర్, కౌన్సిల్‌కు తెలియకుండా పనులు చేసింటే సదరు అధికారిని సస్పెండ్ అయినా చేయాలి, లేకపోతే సరెండర్ చేయాలని సూచించారు. కుక్కల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. తాను కమిషనర్‌గా ఉన్న సమయంలో ఆపరేషన్ భైరవ ప్రాజెక్టు కింద కుక్కలకు ఆపరేషన్ చేయడానికి షెడ్లను ఏర్పాటు చేయించామన్నారు. కుక్కలు, ఆవులు, పందుల నియంత్రణ జరిగితే చాలా మెరుగుపడినట్లే అన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం: స్థానిక ఐదో రోడ్డుకు చెందిన అరవకూరు రఫీ అనే వ్యక్తి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బళ్లారి బైపాస్ రోడ్డులో ట్రాన్స్‌ఫోర్ట్ నడుపుతున్న రఫీ ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో డబ్బిచ్చిన వారు వేధింపులకు దిగడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన కారణాలపై ఓ లేఖ కూడా రాశారని తెలిసింది. కాగా ఆ లేఖను అనంతపురం త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రఫీ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు స్కూల్ టీచరుకు దేహశుద్ధి

అనంతపురం క్రైం: స్థానిక నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ విద్యార్థినితో ఓ స్కూల్ టీచరు అనుచితంగా వ్యవహరించడంతో బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు అతడ్ని చితకబాదినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి ఈ ఘటనపై విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కమ్మభవన్ సమీపంలో సోమవారం ఉదయం కొంత మంది ఓ ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడిని చితకబాదారు. తాను పని చేసే స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినితో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులకు చెప్పడంతో టీచరును పిలిపించి చితకబాదినట్లు తెలిసింది.

మహిళా సమస్యలపై ఉద్యమిస్తాం

అనంతపురం అర్బన్: మహిళల సమస్యల పరిష్కారానికి, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హింసకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని స్త్రీ విముక్తి సంఘటన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సంఘం జిల్లా మహాసభల్లో 11 తీర్మానాలు చేశామన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి, కార్యదర్శిగా మల్లీశ్వరి, ఉపాధ్యక్షురాలిగా ఎం.వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా రాధ, కోశాధికారిగా సి.నాగమణిని ఎన్నుకున్నారు. వీరితో పాటు ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

బుక్కరాయసముద్రం: జంతులూరు వద్దున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో బుధవారం కమాండెంట్ గంగాధర్ రావు కానిస్టేబుల్ ఉదయ్ భాస్కర్ భార్య దీపికకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.50 వేల చెక్కును అందించారు. ఉదయ్‌భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అదుకుంటామని కమాండెంట్ తెలిపారు. దీపికకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు. బెటాలియన్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం



చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో లబ్ధిదారులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం



రాప్తాడు మండలం గొల్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని వైద్యాధికారి శ్రావణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి ప్రారంభిచారు. దాదాపు 270 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ తదితర ఆరోగ్య పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలు, కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 10 మందిని శస్త్ర చికిత్సలకు అనంతపురం రెఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, సర్పంచ్ హన్మంత రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భోగే లక్ష్మీదేవి, గొర్రెలు, మేకలు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహా గౌడ్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎంపీపీ అంజలి పేర్కొన్నారు. బుధవారం మేడాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ గేటు పీహెచ్‌సీ వైద్యులు రవినాయక్ ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ప్రజలకు సేవలందించారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ గర్భవతులకు పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, సర్పంచ్ రామాంజినేయులు, ఈఓఆర్డి అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలచెర్లలో..

రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివ కృష్ణ, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు నేతాజీ స్కూల్‌లో..

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 4వ రోడ్డు వద్ద ఉన్న నేతాజీ స్కూల్‌లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని కమిషనర్ కే భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం నేతాజీ స్కూల్‌లో హెల్త్ క్యాంపు ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. 62, 63, 66వ సచివాలయాల పరిధిలోని ప్రజలు వైద్య శిబిరానికి హాజరుకావాలని తెలిపారు.

బి.యాలేరులో నేడు..

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ దయాకర్, ఎంపీడీఓ రఘునాథ్ బుధవారం తెలిపారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆడపిల్లల చదువు అవనికే వెలుగు



విరాళం అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



ఆత్మకూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆశావర్కర్ల వేషధారణలో చిన్నారులు

రాప్తాడు: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. నేటి బాలికలే రేపటి సమాజంలో తల్లులు. ఆడపిల్లలను కాపాడుకుందాం.. గౌరవిద్దామని ఎస్ఐ ఆంజనేయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ముత్యాలమ్మ, అడ్వకేట్ శంషాద్ బేగం అన్నారు. బుధవారం రాప్తాడులోని ఆర్డీటీ కార్యాలయం, మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆడపిల్లల చదువు అవనికే వెలుగని, నేడు ఉన్నత విద్యను అభ్యసించి ఎందరో మహిళలు అత్యున్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచడం కోసం బాలికల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆడపిల్ల పుట్టిందని కుటుంబానికి భారం కాకుండా కుటుంబాన్ని నడిపించే శక్తిగా తల్లిదండ్రులు భావించాలన్నారు. ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. 13 నుంచి 18 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న కౌమరదశ బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలన్నారు. ఆడపిల్లలపై సమాజంలో వివక్ష వీడాలన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడపిల్లలకు వివాహాలు చేయాలన్నారు. సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ లింగవివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎటిఎల్ మల్లికార్జున, ఆర్డీటీ సిబ్బంది, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సమానంగా చూద్దాం

ఆత్మకూరు: ఆడపిల్లలను తక్కువ చూపు చూడటం, గర్భంలోనే అబార్షన్ చేయించడం నేరం. ఆడపిల్లలను అన్నింటా సమానంగా చూద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆడపిల్లలను బతకనిద్దాం, చదవనిద్దాం, ఉన్నత స్థాయికి ఎదగనిద్దాం అంటూ పిల్లలతో నినాదాలు చేయించారు. అదే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల వేషధారణలో బాలికలు అలరించారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ప్రీతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: బడికి వెళ్లాల్సిన పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం. బాలికల విద్యను ప్రోత్సహిస్తేనే సమాజం ఉన్నతంగా ఎదుగుతుందని సీఆర్‌డీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాం బాషా అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా కోవూరు నగర్‌లోని రెయిన్‌బో హోమ్ చిన్నారులు, అనాథలతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్రీసెంట్ రైయిన్‌బో హోమ్ మేనేజర్ పుష్పలత, శిల్ప, రేష్మ, లక్ష్మీకాంతమ్మ, మమత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సేకరించిన రూ.1,08,000లను స్పందించు-సాయం అందించు కార్యక్రమానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి , ఆర్డీ ఏరియా టీం లీడర్ మల్లికార్జున, డాక్టర్ ఎం.రామకృష్ణా రెడ్డి, మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ ఎస్.లావణ్య, డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, జి.సుధాకర్ రెడ్డి, ఎస్.శ్రీనివాస రావు, కే.మల్లికార్జున రావు, డాక్టర్ ఎం.ఆర్.ధీరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నతికి తోడ్పాటునందించాలి

కనగానపల్లి: సమాజంలో బాలికలు ఉన్నత స్థానాల్లో నిలవడానికి వారి తల్లిదండ్రులు సరైన తోడ్పాటునందించాలని ఆర్డీటి డైరెక్టర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల విద్యార్థినులతో కలసి ఆర్డీటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ రఘురాం, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, రవికిరణ్, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సంతకాల సేకరణ

అనంతపురం టవర్‌క్లాక్: కృష్ణా జలాలను పునః పంపిణీ చేయాలని తీసుకొచ్చిన చీకటి జీవోను వ్యతిరేకిస్తున్నాం. గురువారం అనంతపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహిస్తున్నట్లు అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ బుధవారం తెలిపారు.

సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం

సందర్భం: నేడు సమాచార హక్కు దినోత్సవం



స.హ చట్టంపై బెస్ట్ ఫిల్మ్ అవార్డు అందుకున్న అనంత కళాకారులను అభినందిస్తున్న డాక్టర్ గేయానంద్ (ఫైల్)

అనంతపురం కల్చరల్: సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రంగా భావించబడే స.హ. చట్టంపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో అనేక సంఘాలు కృషి చేస్తున్నాయి. పారదర్శకతే లక్ష్యంగా రూపొందించిన సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్న ఉద్దేశంతో 2005 అక్టోబర్ 12న స.హ.చట్టం అధికారికంగా ఆవిర్భవించింది. అధికారికంగా ఉండే స.హ. చట్టం కమిటీకి జిల్లా కలెక్టర్ సమన్వయ కర్తగా, డీఆర్వో నోడల్ అధికారిగా వ్యవహరిస్తుంటారు. జిల్లా ఎస్పీ, డీఈవో, జెడ్పీ సీఈవో, డీపీవోతో పాటు ఇతర అధికారులు ఇందులో ఉంటారు. బయట నుంచి మరో ఇద్దరు వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

30 రోజుల్లో సమాచారం..

మనకు కావాల్సిన సమాచారం కోరుతూ కేవలం ఒక తెల్ల కాగితంపై రాసి ప్రజా సమాచార అధికారికి అందిస్తే 30 రోజుల్లోపు సమాచారం అందుతుంది. వైట్ రేషన్ కార్డు కల్గి ఉన్న వారైతే ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 దరఖాస్తుతో పాటు చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై విస్తృత అవగాహన కల్పించడానికి జిల్లా కేంద్రంలో సమాచార ఐక్యవేదిక, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక, సమాచార హక్కు పరిరక్షణ సంఘం, ఫైట్ ఫర్ రైట్స్ వంటి సంస్థలు జిల్లాలో పనిచేస్తున్నాయి.

అనంత చిత్రానికి ప్రత్యేక ప్రశంస

దర్శకుడు తరిమెల రాజు, ఆర్‌టీఐ యాక్టివిస్టు స.హ. చట్టంపై విస్తృత అవగాహన కల్పిస్తూ ఈ ఏడాది నిర్మించిన 'పవర్ ఆఫ్ కామన్ మ్యాన్' చిత్రం రాష్ట్రస్థాయిలో ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఎంపికై ప్రశంసలందుకుంది. విజయవాడలో అనంత కళాకారులు ఇటీవలే అవార్డులందుకున్నారు. ఇదే నేపథ్యంలో స.హ చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనేక అవగాహన కార్యక్రమాలు జరుగనున్నాయి.